క్లుప్తంగా...

ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణానికి స్థలం పరిశీలన



రాంపల్లిలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: రాంపల్లి పరిధిలో సర్వే నంబర్ 342–1లోని 10 గుంటల ప్రభుత్వ స్థలాన్ని ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి ఉపయోగించేందుకు సదరు స్థలాన్ని శనివారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు నాగేష్‌గౌడ్, కళావతిలతో కలిసి పరిశీలించారు. సదరు స్థలాన్ని ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించాలని అధికారులకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు గండి అంజయ్యగౌడ్, గ్రామస్తులు సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జవహర్‌నగర్ అధ్యక్షులు బీఆర్ఎస్‌లోకి..?

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో సమస్యలపై స్పందిస్తూ గతంలో మంత్రి మల్లారెడ్డికి సోషల్ మీడియాలో నిద్ర లేకుండా చేసిన బీజేపీ నేత బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు వార్తలు విశేషం. బీజేపీలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకొని మంత్రి మల్లారెడ్డి, బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ఉండేవారు. ఆదివారం జవహర్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న సమావేశంలో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీజేపీ నాయకుడితో పాటు పలువురు ఇతర పార్టీ నాయకులు చేరనున్నారు.

28న జోనల్ క్రీడల సెలక్షన్స్

మేడ్చల్: మేడ్చల్ జోనల్ క్రీడల సెలక్షన్స్ ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు జోనల్ క్రీడల కార్యదర్శి నాగరాజు తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో ఆటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని కేఎల్ఆర్ టౌన్‌షిప్‌లోని క్రికెట్ ఎరినా గ్రౌండ్‌లో సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి ముగ్గురేసి చొప్పున విద్యార్థులు ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు.

గురుకుల కళాశాలలో అడ్మిషన్స్ కోసం సంప్రదించాలి

మేడ్చల్: మేడ్చల్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయంలో ఇంటర్మీడియట్ ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాల కోసం నేరుగా కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ శైలజ కోరారు. ఎంఈసీ విభాగంలో ఎనిమిది ఖాళీలు, సీఈసీ విభాగంలో నాలుగు ఖాళీలు ఉన్నాయని అర్హత ఉన్న వారు సోమవారం నేరుగా కళాశాలలో ఉదయం 11గంటలకు సంప్రదించాలని కోరారు.

నేడు గడిమైసమ్మ బోనాలు

మేడ్చల్: శ్రావణ మాసంలో నిర్వహించే మేడ్చల్ గడిమైసమ్మ బోనాలను ఆదివారం నిర్వహించనున్నారు. మేడ్చల్ ప్రాంతంలో వైభవంగా నిర్వహించే బోనాల పండగకు మేడ్చల్ గడిమైసమ్మ ఆలయం, మేడ్చల్ పట్టణం సుందరంగా ముస్తాబైంది. వేలాది మంది భక్తులు పాల్గొనే పండగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణం నుంచి ఆలయానికి వెళ్లే వీధులను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ప్రధాన రహదారులు పూర్తిగా విద్యుత్ వెలుగులతో నిండిపోయాయి. బోనాలు, ఫలహారం బండ్లు, తొట్టెల ఊరేగింపులు వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నూతన సబ్ రిజిస్ట్రార్‌కు సన్మానం



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ నూతన సబ్‌రిజిస్ట్రార్‌గా శనివారం బాధ్యత స్వీకరించిన జగన్ మోహన్ రాజును తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ జిల్లా, మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. జిల్లా, మండల అధ్యక్షులు మహేశ్, గోవర్ధన్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు రాజశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నందు, కార్యదర్శి శ్రీనుయాదవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి ఎన్నో నిధులు

- మంత్రి చామకూర మల్లారెడ్డి
- రూ.3.20 కోట్లతో అభివృద్ధి పనులు



దమ్మాయిగూడలో అభివృద్ధి పనులు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

కీసర: శివారు మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో సుమారు రూ.3.20 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీల్లోని సమస్యలను పరిష్కరించేందుకు అధిక నిధులు కేటాయిస్తోందన్నారు. దమ్మాయిగూడలో ఇప్పటికే కోట్ల రూపాయలు వెచ్చించి స్ట్రామ్ వాటర్ పైప్‌లైన్ పనులు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్ రెడ్డి, కౌన్సిలర్లు పావనిరెడ్డి, మోర మౌనిక, నర్సింహరెడ్డి, అనురాధ, రమేష్‌గౌడ్, శ్రీహరిగౌడ్, స్వప్న హరిగౌడ్, కొత్త సురేఖభాస్కర్‌గౌడ్, కొత్త హేమలత, నానునాయక్, వెంకటేష్, నాగయపల్లి సుజాత, కమిషనర్ రాజమల్లయ్య, బీఆర్ఎస్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

చెరువులో చేపపిల్లలను వదిలిన మంత్రి

మేడ్చల్: మేడ్చల్ పెద్ద చెరువులో మంత్రి మల్లారెడ్డి శనివారం చేప పిల్లలను వదిలారు. మత్స్య సంపదను పెంచేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం లక్షల సంఖ్యలో చేపపిల్లలను చెరువుల్లో వదులుతోందని చెప్పారు. చెరువులో 2లక్షల 83వేల చేప పిల్లలను వదిలామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహరెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానందరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని ఎల్లంపేట్ గ్రామానికి చెందిన ఇద్దరికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి మల్లారెడ్డి పంపిణీ చేశారు.

ఘనంగా శ్రీమహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

ఘట్‌కేసర్: కొర్రెముల్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీమహంకాళి సమేత బ్రహ్మసూత్ర నీటకంఠ విగ్రహ ప్రతిష్ఠ పూజలను శనివారం ఘనంగా నిర్వహించారు. చౌదరిగూడలో కమ్యూనిటీ హాల్ పనులకు శంఖుస్థాపన, పోచమ్మ, ఈదమ్మ ఆలయాల్లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ పూజలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి మల్లారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ భద్రారెడ్డి, సర్పంచులు వెంకటేశ్‌గౌడ్, రమాదేవి, ఎంపీటీసీలు రామారావుముదిరాజ్, భాస్కర్‌రెడ్డి, వినోధ, ఉప సర్పంచులు రాజుముదిరాజ్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ పెద్ద చెరువులో చేప పిల్లలను వదులుతున్న మంత్రి మల్లారెడ్డి



కొర్రెముల్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి మల్లారెడ్డి, సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్

జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి



జంగిడి శ్రీనివాస్

జవహర్‌నగర్: జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి జంగిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు మాట్లాడారు. వార్తల సేకరణ ద్వారా ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేస్తున్న పత్రికా విలేకరుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నిత్యం ప్రజాసమస్యలను వెలికితీస్తూ చైతన్యం తీసుకువస్తున్న జర్నలిస్టులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని అన్నారు. అర్హులైన వారందరికీ వెంటనే ఇళ్ల స్థలాలను కేటాయించి, డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించాలని సీనియర్ జర్నలిస్టు మంగ యాకయ్య మంత్రి మల్లారెడ్డిని వేడుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మంత్రి స్పందించి జర్నలిస్టులకు న్యాయం చేయాలని కోరారు.

‘అనురాగ్’లో అంతర్జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ముఖ్యఅతిథి మణికంఠ కుమార్

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఈసీసీ, ఈఈఈ విభాగాలు సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ సదస్సును ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హోండా మొబీస్ మేనేజర్ మణికంఠ కుమార్ హాజరయ్యారు. ఇటలీ, యూకే, యూఎస్ఏ, మెక్సికో, తైవాన్ సాంకేతిక నిపుణులు, పరిశోధకులు సదస్సు పరిశీలకులుగా వ్యవహరించారు. సదస్సులో 293 పరిశోధన పత్రాలు స్వీకరించగా 72 పరిశోధన పత్రాలు ప్రచురణకు అంగీకరించారు. ఉత్తమ పరిశోధనలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కులపతి యూబీ దేశాయ్, రిజిస్ట్రార్ బాలాజీ, సీఈఓ నీలిమా, డీన్ ముత్తారెడ్డి, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, మంగళగౌరి, అనిల్‌కమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మేడ్చల్ గడ్డపై బీజేపీ జెండా



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న మహారాష్ట్ర ఎమ్మెల్యే మేఘన

ఘట్‌కేసర్: మేడ్చల్ గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామని మహారాష్ట్ర బోర్డకల్ ఎమ్మెల్యే మేఘన అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో స్థానిక ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి శనివారం జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనపై ప్రజలు విసిగి బీజేపీ వైపు చూస్తున్నారని, తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్‌ను తీసుకొస్తామన్నారు. బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎంపీటీసీ శోభారాణి, అవుషాపూర్ సర్పంచ్ కావేరి, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లు

కీసర: రాంపల్లిదాయర గ్రామంలో శనివారం సర్పంచ్ గరుగుల అండాలు ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చొక్కాపురం నర్సింగ్‌రావు 100 మంది విద్యార్థులకు ఉచితంగా ఆర్టీసీ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ముందుకువచ్చారు. కార్యక్రమంలో కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్, అసిస్టెంట్ మేనేజర్ రజిత, కీసర మండల విలేజ్ బస్‌పాస్ ఆఫీసర్స్ నరసింహారావు, ఇన్‌చార్జి శ్రావన్, ఎంపీటీసీ సభ్యురాలు మంచాల కిరణ్‌జ్యోతిప్రవీణ్, ఉపసర్పంచ్ గాడి రాము, కో ఆప్షన్ సభ్యుడు కందాడి హనుమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టుదలతో అనుకున్నది సాధించాలి



షూటర్ ఈశాసింగ్‌ను సన్మానిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: 22 ఏళ్ల క్రితం విద్యారంగంలోకి అడుగుపెట్టిన తాను నేడు దేశం గర్వించదగ్గ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నానని, వేల మంది విద్యార్థులకు భవిష్యత్ అందించడం వరంగా భావిస్తున్నానని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి (మెయిస్) కళాశాలలో శనివారం నిర్వహించిన ఒరియంటేషన్ డేలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ నిత్యం కష్టపడితేనే ఈ స్థాయిలో ఉన్నానని, విద్యార్థులు నిత్యం కష్టపడాలన్నారు. పట్టుదలతో ముందుకు సాగితే సాధించలేదంటూ ఏదీ ఉండదని అన్నారు. అనంతరం ప్రపంచ షూటింగ్ పోటీల్లో దేశానికి రెండు స్వర్ణ పతకాలు అందించిన ఈశాసింగ్ వారి తల్లిదండ్రులను సన్మానించారు. మల్లారెడ్డి గ్రూప్స్ అధ్యక్షులు భద్రారెడ్డి, డైరెక్టర్ ప్రవీణ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి, కాగ్నిజెంట్ సంస్థ ప్రతినిధి జితేంద్ర సింగ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్



జవహర్‌నగర్ స్పెషల్ డ్రైవ్‌లో బీఎల్‌వోలు





మేడ్చల్ ఫారం-8 పత్రాలు అందజేస్తున్న ఆర్‌ఓ రాంచందర్

మేడ్చల్ జోన్ బృందం: ఓటరు నమోదుకు ఈసీ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి స్పందన లభించింది. ఓటరు సవరణకు ప్రత్యేక అవకాశం కల్పించింది. ఈ మేరకు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఫామ్-6 ద్వారా 32 అప్లికేషన్స్‌ను స్వీకరించారు. ఫామ్-8 ద్వారా 8 అప్లికేషన్స్‌ను స్వీకరించినట్లు కమిషనర్ రామలింగం తెలిపారు. అక్టోబర్ 2023 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఆదివారం నిర్వహించే ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యంతరాలు ఉంటే బీఎల్‌వోల ద్వారా వెంటనే సరిచేస్తున్నామని ఆయన తెలిపారు.

పల్లెల్లో సంపద వనాలు

- 5 మండలాల్లో 47 ఎకరాల స్థలంలో..
- పండ్లు, కలప, సుగంధ ద్రవ్యాల మొక్కలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రతి మండలం పరిధిలో ‘పల్లె బృహత్ ప్రకృతి వనాల’ను పెంచడం ద్వారా ఆర్థిక వనరులను సమకూర్చాలని జిల్లా అధికార యంత్రాంగం భావిస్తోంది. పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలతో మండలాల పరిధిలో 47 ఎకరాల ప్రభుత్వ భూములను గుర్తించిన యంత్రాంగం, వాటిలో మూడేళ్లలో రూ.45 లక్షలతో సంపద వనాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటోంది. హరితహారంలో భాగంగా మొక్కలు పెంచేందుకు ప్రజాధనం ఖర్చు చేయడమే కాకుండా.. తద్వారా ఆర్థిక వనరులను సమకూర్చుకోవడంపై దృష్టి పెట్టాలని అధికార యంత్రాంగం ముందడుగు వేస్తోంది.

ఆర్థిక వనరుల కోసం సంపద వనాలు

మేడ్చల్ జిల్లాలో ఐదు మండలాల పరిధిలో ఎనిమిది నుంచి 10 ఎకరాల ప్రభుత్వ భూములున్న గ్రామ పంచాయతీలను గుర్తించి పచ్చదనానికి తోడుగా పండ్లు, కలప, సుగంధ ద్రవ్యాలను ఇచ్చే టేకు, గంధం, నీలగిరి, ఉసిరి, జామ, మామిడి తదితర మొక్కలు పెంచి వాటి ద్వారా ఆర్థిక వనరులను సమకూర్చుకునేందేకు ప్రణాళిక రూపొందించింది. జిల్లాలో ఘట్‌కేసర్ మండలంలో కాచవాని సింగారంలో ఎనిమిది ఎకరాలు, శామీర్‌పేట్ మండలంలో బోమ్మరాసిపేట్ 9 ఎకరాలు, మేడ్చల్ మండలంలో శ్రీరంగవరంలో 10 ఎకరాలు, మూడుచింతలపల్లి మండలంలో జగన్‌గూడలో 10 ఎకరాలు, కీసర మండలంలో చీర్యాల 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ శాఖ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థకు అప్పగించగా, సంపద వనాల పెంపునకు చర్యలు చేపట్టింది. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన నిధులతో సంపద వనాల్లో భాగంగా పల్లె బృహత్ ప్రకృతి వనాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటోంది. ఐదు మండలాల పరిధిలో ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల్లో సంపద వనాల్లో భాగంగా పల్లె బృహత్ ప్రకృతి వనాల పెంపు కార్యక్రమం కొనసాగుతుందని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి పద్మజారాణి తెలిపారు. పల్లె బృహత్ ప్రకృతి వనాల పెంపుతో హరితహారం లక్ష్యం నెరవేరడంతోపాటు ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నారు.

ఎంజేఎఫ్ జవహర్‌నగర్ కమిటీ ఎన్నిక



ఎంజేఎఫ్ జవహర్‌నగర్ నూతన కమిటీ

జవహర్‌నగర్: మాదిగ జర్నలిస్ట్ ఫోరం జవహర్‌నగర్ నూతన కమిటీ అధ్యక్షుడిగా రామడుగు రమేష్ నియమితులయ్యారు. రాష్ట్ర కమిటీ సమక్షంలో శనివారం నూతన కమిటీని జాతీయ కమిటీ సభ్యులు డప్పు రామస్వామి, ఎర్రోళ్ల బాబు, మహంకాళీల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు అన్యాయం చేస్తోందని ఇప్పటి వరకు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు అందించడంలో విఫలమైందన్నారు. జర్నలిస్టుల సమస్యల కోసం ఎంజేఎఫ్ రాబోయే రోజుల్లో నిరసన కార్యక్రమాలను చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 6న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంజేఎఫ్ జవహర్‌నగర్ అధ్యక్షుడిగా రామగుడు రమేష్, ప్రధాన కార్యదర్శిగా శాగ వెంకటేష్, సలహాదారులుగా తూటి శ్రీనివాస్, బూడిద నరేందర్, కొన్నె శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా గుండె గౌతమ్, స్వామి, గడ్డం పవన్, ఆకునూరి ప్రశాంత్, కార్యదర్శులుగా గాజెపాక నరహరి, ముక్క ప్రవీణ్, గాదరి స్వామి, కోశాధికారిగా మాచర్ల కుమార్, ప్రచార కార్యదర్శిగా ఓరుగంటి ప్రశాంత్‌తో పాటు పలువురిని ఎన్నుకున్నారు.

పాము కాటుతో యువతి మృతి

- ప్రతి గంటా ఆలస్యం కావడమే కారణం..
- బాలాజీనగర్ ఆరోగ్య కేంద్రంలో ఇంజక్షన్ ఆలస్యం
- దాంతో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిన కుటుంబ సభ్యులు
- అక్కడకు వెళ్లే సరికి ప్రాణాలు కోల్పోయిన అఖిల



అఖిల(ఫైల్)

జవహర్‌నగర్: పాము కాటుకు గురైన యువతి సకాలంలో వైద్యం అందక మృతి చెందిన ఘటన జవహర్‌నగర్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ డెంటల్ కాలేజీ సమీపంలోకి భాగ్యనగర్ కాలనీలో నివసించే అలివేలు కూతురు అఖిల(17)ను శుక్రవారం రాత్రి ఇంటి వద్ద పాము కాటు వేసింది. అంబులెన్స్‌కు ఫోన్ చేయగా ఆలస్యమైంది.. వెంటనే బాలాజీనగర్ ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు.. అక్కడి నర్సు యాంటీ వీనమ్ ఇంజక్షన్ వేయాలంటూ సంబంధిత డాక్టర్‌కు సమాచారం అందించి ఇంజక్షన్ ఇస్తానని చెప్పారు. అక్కడ కూడా చాలా సమయం వృథా అయ్యింది. ఇంజక్షన్ తెచ్చే వరకు ఆలస్యం అవుతుందని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ఆమెను తీసుకువెళ్లారని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నారు. ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే అఖిల మృతిచెందింది. అక్కడా.. ఇక్కడా సమయం వృథా కావడంతో ఇంజక్షన్ సకాలంలో అందలేదని, దాంతో మృతి చెందిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ మహానగరంలో ఉన్నామా.. లేక మారుమూల ప్రాంతంలో ఉన్నామా.. అంటూ ఆవేదన చెందారు.

ఉత్సాహంగా కోటి వృక్షార్చన

పల్లె.. పట్నం పచ్చదనంతో మురిసిపోయేలా మొక్కలు నాటి వాటిని పెంచేందుకు పెద్దఎత్తున కదిలారు. అన్ని ప్రాంతాల్లో వందలు, వేల సంఖ్యలో మొక్కలు నాటేందుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేయగా.. కోటి వృక్షార్చనలో భాగంగా శనివారం అధిక సంఖ్యలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలంటూ ఇళ్లకు వెళ్లి మొక్కలను అందజేస్తూ హరిత హారంపై అవగాహన కల్పిస్తున్నారు.



కాచివానిసింగారంలో మొక్కలు నాటుతున్న అదనపు సంచాలకులు రామారావు, సీఈఓ, డీపీఓ తదితరులు



రాంపల్లిలో మొక్కలు నాటుతున్న నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు



గుండ్లపోచంపల్లిలో మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి



మేడ్చల్‌లో మొక్కలు నాటుతున్న చైర్ పర్సన్ దీపికనర్సింహరెడ్డి, కమిషనర్ త్రిలేశ్వరావు



ఘట్‌కేసర్‌లో మొక్కలు నాటుతున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీ



జవహర్‌నగర్‌లో మొక్కలు నాటుతున్న మేయర్ కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో మొక్కలు నాటుతున్న తూంకుంట చైర్మన్ కారంగుల రాజేశ్వరరావు